# పరిధి దాటిన వేళ

**వీథి తలుపు తెరిచే ఉంది. లోపలికి అడుగు పెడుతూంటే, "అదిగో, వచ్చిందావిడగారు!"**

అన్నారాయన నన్ను చూడగానే. ఫోన్‌లో ఎవరితో మాట్లాడుతున్నారో తెలియలేదు.

"ఇదిగో. మాట్లాడు...నీ కూతురు" అంటూ ఫోన్ నా చేతికిచ్చారు. "ఎక్కడికి కెళ్ళావే తల్లీ!" అంది ఏడుపు గొంతుతో, చిట్టి. నేను సమాధానం చెప్పేలోపున తనే "చెప్పకుండా ఎక్కడికెళ్ళిపోయావ్? నాన్నగారు ఆ మాట చెప్పినప్పటి నుంచీ ఎంత కంగారు పడుతున్నానో తెలుసా? దేవుడికి ఎన్ని దణ్ణాలు పెట్టుకున్నానో..." దాని జోరు ఆగేట్టులేదనుకుని మధ్యలో అడ్డుకుని.

"దారి తప్పిపోయాను వెతుక్కుంటూ వచ్చేసరికి ఆలస్యమైపోయింది....." అని వివరంగా అన్నాను చిట్టితో.

ఆయన వెళ్ళి తలుపు తెరిచారు.

మా అబ్బాయి ఆఫీసు నుంచి అప్పుడే వచ్చేశాడు. గుమ్మంలో అడుగుపెడుతూనే. నన్ను చూసి "అమ్మయ్య! వచ్చేశావా! ఎక్కడికి వెళ్ళావ్?" అన్నాడు ఆందోళన నిండిన స్వరంతో.

నేను చిరునవ్వు నవ్వాను. ఆయన నాకేసి గుడ్లురిమి చూశారు. అబ్బాయి బిక్కచచ్చిపోయినట్లు చూశాడు.

"ఎవరొచ్చారే?" అంటూ గట్టిగా అరిచింది చిట్టి. ఫోన్ ఇంకా చేతిలో ఉన్న సంగతి మరిచే పోయాను.

"మీ అన్నయ్య ఆఫీసు నుంచి వచ్చేశాడు. అప్పుడే వాడికి చెప్పి కంగారు పెట్టేసినట్టున్నారు మీ నాన్నగారు పాపం ఆఫీసు నుంచి మధ్యలో వచ్చేశాడు.

"అప్పుడే చెప్పక ఏం చేస్తారు! పాపం నాన్నగారికి ఎంత భయమేసిందో - ఎక్కడికి వెళ్ళిపోయావో తెలియక. ఇరుగు పొరుగు వాళ్ళు కూడా ఎవరూ సరిగ్గా తెలియరాయనకు. ఇల్లు తాళం పెట్టి ఎక్కడకని వెడతారు ఈ వయస్సులో ఈ కొత్తచోట? నువ్వు మాత్రం చిన్నదానివనుకుంటున్నావా? ...అయినా, చెప్పకుండా వెళ్ళటం ఏమిటి?.....ఏమన్నా తగువు పెట్టుకున్నారా పొద్దున్నే?..." అంటూ మొదలు పెట్టింది.

"సరేలే, ఏం కాలేదులే నేను మళ్ళీ మాట్లాడతాను తీరిగ్గా. పెట్టేస్తున్నాను" అని ఫోన్ పెట్టేశాను. .

కాళ్ళ బూట్లయినా విప్పుకోకుండా, చేతిలో బ్రీఫ్ కేస్ అలాగే పట్టుకుని అబ్బాయి మొదలు పెట్టాడు.

"ఎక్కడికెళ్ళావే చెప్పకుండా? ఎందుకెళ్ళావ్?" అని నన్నడుగుతూనే తండ్రికేసి చూశాడు అనుమానంగా.

"చెప్పకుండా ఎక్కడికెళ్ళావ్? ఎందుకెళ్ళావ్? నేనేమన్నాననని?" అన్నారాయన ఒణుకుతున్న కంఠంతో.

"ఎవరూ ఏమీ అనలేదు. నాకేమీ కాలేదు... ముందు కాస్త స్తిమితపడు, కాఫీ ఇస్తాను" అన్నాను అబ్బాయితో.

"వాడికి కాఫీ ఏమిటి, నువ్వు అన్నమైనా తినకుండా?" అన్నారాయన.

"మరి మీరు తిన్నారా?" అన్నాను బల్లమీద బోర్లించి ఉంచిన కంచాలు చూసి

"ఎలా తింటాననుకున్నావ్ నువ్వు వడ్డించందే?!" అన్నారు.

మనసులోనే నవ్వుకున్నాను- "నువ్వు లేందే ఎలా తింటాను!" అని ప్రేమగా అనాలని ఆయనకి తోచనందుకు!

ఇంతలో ఫోన్ మోగింది. అబ్బాయి బ్రీఫ్ కేసుని బల్లమీద పెట్టి ఫోన్ అందుకున్నాడు. అవతల నుంచి వచ్చిన మాటలు విని. "ఆ, తెలిసింది. ఇంటి కొచ్చేసింది..." అంటున్నాడు.

ఎవరో ఆ ఫోన్ చేసింది? ఈయన అందరికీ చెప్పేసి కంగారు పెట్టేశారు. సిగ్గుచేటు!

ఫోన్ నాచేతికిస్తూ, "లలిత" అన్నాడు.

"చెప్పకుండా ఎక్కడికెళ్ళిపోయారు అత్తయ్యగారూ?! మా ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ జరుగుతోంది. తక్షణం బయలుదేరాలంటే ఎలా కుదురుతుంది? ఎవరికన్నా చెప్పాలన్నా సిగ్గుగా ఉంది. ఎన్ని ప్రశ్నలు వేస్తారు! ఎలా సమాధానాలు చెప్పడం? ఏమిటలా చేశారు?... అంటూ మొదలుపెట్టింది కోడలు.

కోర్టులో బోనులో నిలబెట్టినట్టుగా ఉంది నా పరిస్థితి. "ఏం కంగారుపడకు. ఇంటికొచ్చాక వివరంగా తెలుసుకుందువుగానిలే" అని పెట్టేశాను ఫోను.

ఆయన పొద్దున ధ్యానం చేసుకుంటున్నారు. ఆ ధ్యానం ఇంకో అరగంటయినా తెమలదు. ఆయన ఈ మధ్య ధ్యానం చేసుకోవడం మరీ ఎక్కువైపోతోంది. భోజనం టైమయిపోయినా ఆ ధ్యానం లోంచి ఊడిపడరు. కొడుకూ కోడలూ ఆఫీసులకీ, పిల్లలు యూనివర్సిటీకి వెళ్ళిపోయాక ప్రశాంతంగా ఉంటుందని అప్పుడు మొదలుపెడతారు ధ్యానం. గదిలో ఓ మూల చాపమీద బాసింపట్టేసుకుని కూర్చుంటారు.

నేను రోజూ భోజనం చెయ్యగానే వేసుకోవలసిన బి.పి. మందులు అయిపోయాయి. ఒక్కపూట కూడా మానకూడదని డాక్టరుగారు చెప్పారు. అయిపోయి అప్పుడే ఇవాళ్టికి మూడోరోజు. అబ్బాయికి రెండుమూడు సార్లు చెప్పినా తెస్తాను తెస్తాను అంటూనే అశ్రద్ధ చేశాడు. ఆఫీసుకి వెళ్ళగానే ఇల్లు మాట మరిచిపోతారు కాబోలు. ఫలానా వస్తువు తెచ్చావా అంటే ఇద్దరూ తెల్లమొహం వేస్తారు. కోడలు బస్సులో వెళ్ళివస్తుంది. అందుకని హడావిడిలో తనకు వీలుండదు అంటుంది. వాడు స్కూటర్ మీద వెడతాడు - రోడ్డుమీద రద్దీని దాటుకుని వెళ్ళేసరికే ప్రాణాంతకం అవుతుంది. ధ్యానం అంతా రోడ్డుమీదే ఉంటుంది. ఇంకో ప్రసక్తి మనసులోకి రాదంటాడు. ఇంటికొచ్చేసరికి కోడలు అలసిపోయి వడిలిన తోటకూర కాడలా వేళ్ళాడబడిపోతుంది. వాడు వచ్చేటప్పటికి రాత్రయిపోతుంది. పిల్లలు సరేసరి - వాళ్ళు ట్యూషన్లూ, కోచింగులూ అంటూ ఎప్పుడూ ఇంటిపట్టున ఉండరు. ఉన్నప్పటికీ వాళ్ళు గదిలో తలుపు లేసుక్కూచుంటారు.

మేమిద్దరం వచ్చినప్పటి నుంచీ వాళ్ళందరికి ఏదో ఒక విధంగా ఇబ్బంది కలుగుతున్నట్లు బాధపడటం తెలుస్తూనే ఉంది. మేమే ఇక్కడికి కావాలనీ, సుఖపడదామనీ వచ్చామా? గృహ ప్రవేశానికి రమ్మని మరీ మరీ చెబుతూ ఉత్తరాలు రాస్తే వచ్చాం. తల్లీ తండ్రీ రాకపోతే నలుగురూ ఏమైనా అనుకుంటారుట. అందుకని కాబోలు రమ్మన్నారు. కోడలి తల్లిదండ్రులు మూడోనాడు వెళ్ళిపోయారు. మేము కూడా అలా వెళ్ళిపోవాలని అనుకున్నారేమో-పైకి అనలేదు. రాకరాక వచ్చాం కొడుకింటికి. ఒక్కగాని ఒక్క కొడుకు నాలుగు రోజులుందాం అనిపిస్తుంది కదా. ఎప్పుడు వెళ్ళిపోతారా అని ఎదురుచూస్తున్నట్లుగానే ఉంది పిల్లల ధోరణి. కొడుకు, మేము ఇంట్లో ఉన్నామా లేదా అని పట్టించుకోనట్లే ప్రవర్తిస్తాడు. మాతో మాట్లాడటానికేమీ కబుర్లుండవు వాడికి. చిన్నప్పుడయితే, వాళ్ళ నాన్నగారి దగ్గరకి వెళ్ళడానికి భయపడి నా ఒళ్ళోనూ నా పక్కలోనూ చేరి వాడి స్కూలు కబుర్లూ అవీ ఎన్ని చెప్పేవాడు! కాలేజీలో చదువుతున్నా, అమ్మా అమ్మా అంటూ కూడా

తిరిగేవాడు ఏదో ఒకటి చెబుతూ. ఉద్యోగం కోసం ఈ మహాపట్నం వచ్చాక మాకు ప్రయాణం దృష్ట్యా దూరమవడమే కాకుండా, మానసికంగా కూడా దూరమవడం మొదలైంది. కొత్తలో అడపా తడపా ఉత్తరాలు రాసినా క్రమంగా అవీ తగ్గిపోయాయి. పెళ్ళయి పిల్లలు పుట్టాక వాడి సంసారం వాడిది. మా సంసారం మాది. ఎప్పుడో ఏడాదికోసారి చుట్టపు చూపుగా రావడం, ఓ పదిరోజులు మా ఇంట్లోనూ, నాలుగైదు రోజులు అత్తారింట్లోనూ, మరో నాలుగైదు రోజులు పిల్లలకి చూపించడం కోసం ఏదో ఒక కొత్త ఊరికి వెళ్ళిరావడం - ఇలాగే గడిచిపోతున్నాయి రోజులు సంవత్సరాల తరబడి.

అక్కడ ఇంట్లో మాకు తోడు ఓ కుక్కా దొడ్లో మొక్కలూ, ఆయన వ్యాపకాలు - వీటితో ఇల్లూ ఊరూ వదిలిపెట్టి మేమూ కదల్లేదు ఇన్నాళ్ళూ. ఎప్పుడూ వాళ్ళు వచ్చి వెళ్ళడమే చెప్పుల్లో కాళ్ళు పెట్టుకుని. మాకు అవసరం వచ్చినా, వాళ్ళకి అవసరం వచ్చినా వాళ్ళు రావడమే.

ఇప్పుడిక్కడ ప్రతీదీ కొత్త. పైగా ఊరు శివార్లలో కొన్న ఇల్లు. అది కూడా విడిగా ఉన్న ఇల్లు కాదు. ఒక్కొక్క అంతస్తులో నాలుగు వాటాలున్న మూడంతస్తుల భవనం. చుట్టుపక్కల ఇంకా అలాంటి భవనాలూ, దుకాణాలూ అవీ కడుతున్నారు. కొన్ని దుకాణాలు రెండు మూడు ఫర్లాంగుల దూరంలో ఉన్నాయి. మందులు కావాలన్నా అక్కడిదాకా వెళ్ళాలట. ఓసారి ఎప్పుడో అబ్బాయి వాళ్ళూ మాట్లాడుకుంటూంటే తెలిసింది.

సరే నోట్లో నాలుక ఉంది కదా, ఎవరి నడిగినా మందుల దుకాణం ఎక్కడుందో చెప్పమంటే ఆ మాత్రం చెప్పకపోరు. నేనే వెళ్ళి తెచ్చుకుందామనుకున్నాను. ఈయనగారి ధ్యానం ఓ పట్టాన ముగిసేటట్లు లేదు. ఏ ఊహాలోకాల్లో విహరిస్తారో ఏమో? ఏ ధ్యానాలయినా మగవాళ్ళకే చెల్లుతాయి. అలా బాసిం పట్టేసుకుని గంట కాదు, అరగంట సేపయినా ధ్యానం చేస్తూ కూచోవాలంటే ఆడదానికి కుదురుతుందా? ఎన్ని అవాంతరాలొస్తాయి - ఎవరో ఒకరు తలుపు కొట్టడమో, పనిమనిషి పిలవడమో, పిల్లి వంటింట్లోకి దూరి గిన్నెమీది మూతపగలకొట్టడమో, ఇంట్లో పిల్లలుంటే గోల చెయ్యడమో - ఏదో ఒకటి. ఈతి బాధల్తోనూ, నానా చింతలతోనూ సతమతమవుతూంటే ఆధ్యాత్మిక చింతనకి తీరికెక్కడ!

సరే, ఆయన ధ్యానం లోంచి బయటపడే లోపున నేను మందుల దుకాణానికి వెళ్ళిరాలేనా అని, తలుపు బయటనుంచి గట్టిగా నొక్కి (అది దానంతటదే గడియపడుతుంది - ప్రత్యేకంగా పై నుంచి తాళం వెయ్యక్కర్లేదు) బయలుదేరాను. నేను తిరిగి

వచ్చేటప్పటికి ఆయన ధ్యానం పూర్తవుతుందని, తలుపు కొడితే ఆయనే తలుపుతీస్తారు కదా అనీ డబ్బులు తీసుకుని బయలుదేరాను. బజారు పన్లు చేసుకోవడం మా ఊళ్ళో అలవాటులేకపోయినా, మొండికేసి బయలుదేరాను. ఎంతకని మగవాళ్ళమీద ఆధారపడ్డం? చీటికీ మాటికీ అడిగితే వాళ్ళు విసుక్కోవడం! వీలైనంతవరకు ఎవరి పనులు వాళ్ళు చేసుకోగలిగితే, ఇతరులకీ మనకీ కూడా ఇబ్బందుండదు. ఏమిటో మొదటి నుంచీ ఆడపనులూ, మగపనులూ అంటూ విడదీసి ఆడదాన్ని ఇంట్లో కట్టిపడేశారు. వీధిలోకి ఒంటరిగా వెళ్ళాలంటే బెరుకు, భయం. ఈ కాలం ఆడవాళ్ళకా బాధలేదు. కానీ వాళ్ళ బాధలు వాళ్ళకి - ఇంటా బయటా చాకిరీ చెయ్యలేక, బస్సుల్లో పడి పోలేకా సతమతమవుతున్నారు పాపం.

బిల్డింగు గేటు దాటాక ఎదురైన ఓ పెద్దమనిషిని అడిగాను మందుల దుకాణం ఎటువైపు ఉందని. అతను చెప్పిన ప్రకారం తిన్నగా వెళ్ళి రెండు మలుపులు తిరిగి మెయిన్ రోడ్డు దాకా నడిచాను. వెళ్ళడం బాగానే వెళ్ళాను. తిరిగి వచ్చేటప్పుడు కుడివైపుకి తిరగాల్సినది ఎడమవైపుకి తిరిగినట్లున్నాను. సందు మారిపోయి దారి తప్పాను. ఎన్ని మలుపులు తిరిగి ఎన్ని సందులు తిరిగినా మేముండే బిల్డింగు వైపుకి మార్గం కనిపించలేదు. ఆ బిల్డింగు పేరేమిటో గమ్మత్తుగా ఉంటుంది. సమయానికి గుర్తు రాలేదు. కొత్తగా కట్టిన బిల్డింగు అని చెబితే, అలాంటివి చుట్టుపక్కల చాలా ఉన్నాయన్నారు. మా వాళ్ళ బిల్డింగుకి కొంచెం దూరంలో ఎల్లమ్మ గుడో ఏదో చిన్నగుడి ఉందని చాలా సేపటికి గుర్తుకొచ్చింది. దాని సంగతి చెప్పాక ఓ మహాత్ముడెవరో దారి చెప్పాడు. తిరిగి తిరిగి వచ్చేసరికి మిట్ట మధ్యాహ్నం అయింది. మేడ ఎక్కాక తలుపుకొట్టే అవసరమే లేకపోయింది. తలుపు తెరిచే ఉంది. ఆయన ఫోన్‌లో మాట్లాడుతున్నారు.

చెప్పకుండా వెళ్ళిపోయానని వీళ్ళంతా ఒక్కటే మాట. నేను ఉన్నమాట చెబితే ఎవరూ నమ్మడం లేదు. నేను కోపంతో వెళ్ళిపోయి ఉంటాననుకుని, ఎదురు నన్ను నిలదీస్తున్నారు!

పొద్దున్నే ఆయన మీసాలు కత్తిరించుకునే చిన్న కత్తెర కనిపించడం లేదని నా మీద ఎగిరారు. నేను చూడలేదు. నేను తియ్యలేదు మొర్రో అన్నా వినిపించుకోలేదు.

"ఎన్నేళ్ళొచ్చినా, ఎన్నేళ్ళు కాపురం చేసినా ఏం లాభం? నా వస్తువులు ముట్టుకోవద్దంటే వినవు. తీసిందానివి ఎక్కడున్న వాటిని అక్కడ పెట్టవు...." అంటూ సాధించారు. ఆ కత్తెర చివరికి టెలిఫోన్ పక్కన చిన్న బల్ల మీద దొరికింది. ఎవరు తీసి అక్కడ పెట్టారో దేవుడికెరుక. ఈ ఇంట్లో ఉన్నది నేనొక్కర్తెనే కాదుగా. అయినా ఆయనక్కూడ మతిమరుపు వస్తోందన్న విషయం ఒప్పుకోరు. ఆయనకి నేనే కదా చులకన - ప్రతిదీ నా మీదికి

తోసెయ్యడం! అదుగో. అలా సాధించారన్న కోపంతో అందులోనూ కొడుకింట్లో ఉండగా, కోడలూ, మనవలూ వింటూండగా నన్ను సాధించారని కోపం వచ్చి ఇంట్లోంచి వెళ్లిపోయాననుకున్నారు కాబోలు!

ఈ ఊళ్ళోనే ఉంది అమ్మాయి కూడా. ఈ మధ్యనే వాళ్ళకిక్కడకి బదిలీ అయింది. అక్కడికి వెళ్ళాలని బయలుదేరానేమో అనుకుని ఉంటారు. వాళ్ళింటికి తోవ కూడా తెలియదు కదా. అందుకే అంత భయపడి, దానికి ఫోన్ చేశారన్నమాట.

మా భోజనాలు అవీ అయ్యాక మళ్ళీ ఫోనొచ్చింది చిట్టి దగ్గర్నుంచి.

"ఏమిటే అమ్మా, నిజం చెప్పవే! చెప్పకుండా ఇంట్లోంచి ఎందుకు వెళ్ళి పోయావే?" అంది కుతూహలంగా.

"నిజమే చెబుతున్నానే. మందులు కొనుక్కొద్దామని వెళ్ళాను. ఆయన ధ్యానంలో ఉన్నారు. ఇలా వెళ్ళి అలా వచ్చెయ్యొచ్చు అనుకున్నాను" అన్నాను.

"అయినా ఇంట్లో చెప్పకుండా వెళ్ళడం ఏమిటి? నీకు అసలు అలా బజార్లకు వెళ్ళడం అలవాటు లేదుకదా" అంది.

"బావుందే! అవసరమైనప్పుడు కూడా అలవాటులేదని కూచుంటే ఎలా సాగుతుంది? అన్నింటికీ మగవాళ్ళమీద ఆధారపడబట్టే మా బతుకులిలా ఉన్నాయి" అన్నాను చిరాగ్గా.

"అప్పుడప్పుడు నువ్విలాంటి మాటలంటూంటావు కదా అందుకే ముందుగా నాన్నగారిని నేనడిగిన ప్రశ్న - అమ్మని ఏమైనా అన్నారా - ఏం జరిగిందివాళ?- అని." 'మామూలుగానే దేనికో విసుక్కున్నాను పొద్దున్న - అంతే' అన్నారు. అదే నాన్నగారూ, ఎంత విసుక్కున్నా ఎంత తిట్టినా పెళ్ళాం ఇల్లు విడిచి ఎక్కడికి పోతుందిలే అని ధీమా! చూడండిప్పుడు అన్నాను..." అని చిట్టి అంటూంటే,

"అవునే, ఇలాంటివి మామూలేగా. పెళ్ళయ్యాక నీకిప్పుడు మీ నాన్నగారితో అలా మాట్లాడే ధైర్యం వచ్చింది గాని!" అన్నాను.

ఏమో? ఆ మధ్య నువ్వు వృద్ధాశ్రమం గురించి కూడా ఆరాలు తీశావు. కదా! దాంతో నాకు అనుమానం వచ్చింది - కొంపతీసి అక్కడికి వెళ్ళాలని బయల్దేరావేమోనని. నీకు దారి తెలియదు. ఏమయిపోయావో అని హడలిపోయాను. ఏం చెయ్యాలో అర్థంకాక గిలగిల్లాడాను. సమయానికి మీ అల్లుడు కూడా ఊళ్ళోలేరు..." అంది.

"ఇంకా నయం, పోలీసు రిపోర్టు ఇచ్చారు కాదు! మగవాళ్ళు ఎక్కడికి వెడుతున్నారో, ఎన్నింటికి తిరిగివస్తారో చెప్పి వెడుతూంటారా? ఆలస్యమైనప్పుడు ఆడవాళ్ళు

కంగారుపడుతూంటే చివాట్లేస్తారు కూడా. మీ నాన్నగారితో లక్షసార్లు జరిగింది అలా. నేను ఒక్కసారి అలా వెళ్ళేసరికి కొంపలు అంటుకుపోయినట్లు హడావిడి చేశారు అందరూ కలిసి!" అన్నాను నిష్ఠురంగా.

అక్కడే మంచం మీద నడుం వాల్చి నాయన, టెలిఫోన్‌లో నేను కూతురితో అంటున్న మాటలు విని, చటుక్కున లేచి కూచుని, "మగవాడితో వంతా? మగవాళ్ళూ ఆడవాళ్ళూ ఒకటేనా?" అన్నారు ఉద్రేకంగా. ఆయనకి నచ్చజెప్పడం నా వల్ల కాదని నాకు తెలుసు. ఆడదానికి ఏమీ తెలియదు, తన చెప్పుచేతుల్లో ఉంచడం మగవాడి బాధ్యత అనుకుంటారాయన.

సాయంకాలం ఆఫీసు నుంచి కోడలు తిరిగొచ్చాక, మొగుడూ పెళ్ళాలిద్దరూ కలిసి దండెత్తారు నామీద - చెప్పకుండా ఇంట్లోంచి ఎందుకు వెళ్ళావని. వెళ్ళిపోలేదు మొర్రో, వెళ్ళాను అంతే - మందులు తెచ్చుకోవడానికి - అని అంటే వాళ్ళు నమ్మరే! పైగా, మరింత నిష్ఠురంగా మాట్లాడారు.

"అంటే, మీక్కావల్సిన మందులు కొనివ్వడం లేదనేగా! మేము మిమ్మల్ని సరిగ్గా చూసుకోవడం లేదని నలుగురికీ తెలియజెప్పాలనా? ఇంటి చుట్టుపక్కలా, మా ఆఫీసులోనూ, బంధుమిత్రుల్లోనూ మా పరువేం కావాలి?" అంటూ జంటకవుల్లా తగులుకున్నారు. వాళ్ళ లోపాన్ని కప్పిపుచ్చుకోవడానికి తప్పు నామీదకే నెడుతున్నారు. అలాంటి వాళ్ళతో వాదించి ఏం ప్రయోజనం? ఏమంటున్నా మాట్లాడక మౌనం వహించాను.

మనవలిద్దరికీ ఇది వినడానికి చాలా 'థ్రిలింగ్'గా వుందట! నేనేదో 'ఎడ్వెంచర్' చేశానుట!

"ఎంత ధైర్యం చేశావ్ బామ్మా"! అన్నారు నాకు షేక్ హ్యాండ్ ఇస్తూ. కొడుకూ కోడలూ కన్నా వీళ్ళే నయం అనిపించింది. ప్రేమా, అప్యాయతా చూపించకపోయినా, నా ధైర్యాన్నయినా మెచ్చుకున్నారు.

నిజానికి ఇప్పుడున్న ధైర్యం నేను వయస్సులో ఉన్నప్పుడు ఉండేదేకాదు. ఓసారి జరిగిన ఆ సంఘటనని ఎప్పటికీ మరచిపోలేను...పరాయిపిల్ల వ్యామోహంలో పడి ఆపిల్లకి దగ్గరవాలని ప్రయత్నిస్తున్నారన్న అనుమానం బలపడిన రోజు రాత్రి ఆలస్యంగా ఇంటికొచ్చారని ఆయన్ని నిలదీసినందుకు భోజనం సగంలో వదిలేసి వెళ్ళి మంచం మీద పడుకున్నారు. నాకు ఆ ఇంట్లో ఒక్క క్షణం ఉండబుద్ధి కాలేదు. కాని, స్వాభిమానంతో ఇల్లు వదిలిపెట్టి, ఎక్కడికి వెళ్ళాలో ఏం చెయ్యాలో అర్థం కాలేదు. ఆలోచిస్తూ వీధి వరండాలో చీకట్లో మెట్ల పక్కనున్న గట్టు పట్టుకుని నిలబడ్డాను. నేను ఒంటరిదాన్ని కాదు.

రెండేళ్ళ కొడుకున్నాడు. మళ్ళీ కడుపుతో ఉన్నాను. పుట్టింటికి వెళ్ళడానికి ధైర్యమూ లేదు. మనస్కరించనూ లేదు.

పదోక్లాసు చదివిన దానికి ఉద్యోగాలేం దొరుకుతాయి వెంటనే? ముందు బయట అడుగుపెట్టగానే ఉండటానికి స్థలం ఎక్కడుంది? ఎక్కడ తలదాచుకోవడం? చేతిలో డబ్బేదీ? అలాంటి స్థితిలో ఆయన డబ్బుని ఎలా తీసుకోవడం? ఏం చెయ్యడానికీ దిక్కుతోచక - ఇంట్లోంచి ఆయన నన్ను వెళ్ళిపొమ్మనలేదు కదా, అంతవరకూ ఎందుకు వెళ్ళడం? అంతదాకా వస్తే అప్పుడే చూసుకుందాం అని నిశ్చయించుకుని, స్వాభిమానాన్ని అందాకా అడుక్కి తోసేసి లోపలికి వెళ్ళాను.

అటువంటిది, ఇవ్వాళ జరిగిన దానికి వెళ్ళిపోవాలనే ఆలోచనే రాలేదు. కాని, తీవ్రంగా అనిపిస్తే వెళ్ళేదాన్నేమో! ఇల్లు విడిచి వెళ్ళాలంటే ఇదివరకున్న సందేహం, భయం ఇప్పుడు కలగడం లేదు. భయపెట్టేవి పరిస్థితులూ సమాజమూ కాదు. మన మనసులోని ఆలోచనలే - భవిష్యత్తు గురించీ సమాజం గురించీ మనం కల్పించుకున్న భయాలే అని తెలుసుకున్నాను. నిజంగా తాము అనుకున్నట్లు చెయ్యదలచుకున్న వాళ్ళకి ఏవీ అడ్డం రావు. రాముణ్ణి ఎవరు ఆపగలిగారు? సిద్ధార్థుడికి ఎవరు అడ్డు రాగలిగారు? వాళ్ళు చేసిన పనుల్ని వాళ్ళు సమర్థించుకోగలగాలి - అంతే.

రాత్రి ఆయన పక్కమీద కూచుని, మళ్ళీ అడిగారు అనునయంగా - "చెప్పకుండా ఎందుకెళ్ళిపోయావే?" అని. "మందులు తెచ్చుకోవడానికి అని చెబితే నన్ను వెళ్ళనిస్తారా మీరు?.. అది సరేగాని, కావాలనే చెప్పకుండా వెళ్ళిపోయానని ఎందుకనుకున్నారు?" అన్నాను.

"అన్నం కూడా పెట్టకుండా వెళ్ళిపోతే నేనేమనుకోవాలి?"....నీమీద పొద్దున్న అలా విసుక్కున్నాగా. అందరి ముందూ కోప్పడినందుకు పౌరుషం వచ్చి వెళ్ళిపోయావేమో అని అనుమానం వేసింది. గంటన్నరయినా తిరిగి రాకపోయేసరికి...ఇంట్లో నన్ను ఒక్కణ్ణీ వదిలేసి అలా వెళ్ళిపోవడం ఏమిటి?...." అన్నారు.

ఒంటరితనం అంటే తనకున్న భయాన్నీ, ఇంట్లో పనులన్నిటికీ తను నామీద ఆధారపడుతున్నారన్న నిజాన్నీ తన 'అధికారం' ముసుగు కింద దాచి, సహజ ధర్మాన్ని ప్రదర్శిస్తూ, "ఇంకెప్పుడూ అలాంటి పిచ్చిపని చెయ్యకు" అంటూ గదిలో దీపం ఆర్పేసి నిశ్చింతగా పడుకున్నారు.

అనుకోకుండా వీళ్ళందరిని కాస్సేపు ఓ ఆట ఆడించగలిగానన్న ఆనందంతో చాలా సేపు నిద్రపట్టలేదు నాకు!

'పత్రిక' ప్రారంభ సంచిక నవంబర్ 2001